

ఆలస్యం.. అమృతం.. విషం..

సైబర్ మోసం జరిగిందా.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదిస్తే డబ్బులు బదిలీ అయిన ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. గతంలో ఈ సమయం గంట వరకు ఉండేది. ప్రస్తుతం అది నిమిషాల్లోకి మారిపోయింది. ఈ సమయాన్నే గోల్డెన్ అవర్.. గోల్డెన్ టైం అంటారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు వీలు లేని సమయంలో టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇటీవల గోల్డెన్ టైంలో ఫిర్యాదు చేసిన పలువురి డబ్బులను పోలీసులు రికవరీ చేశారు. బాధితులు స్పందించిన సమయాన్ని బట్టి డబ్బుల రికవరీ ఆధారపడి ఉంటుంది. ఆలస్యం చేస్తే అంతే..

- కరీంనగర్ క్రైం (ఆంధ్రజ్యోతి)

7

- సైబర్ మోసాలపై సత్వరమే స్పందించాలి
- గోల్డెన్ టైంలో ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం



జిల్లా విద్యాశాఖాధికారిపై
ఆర్జేడీ విచారణ
-కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి
6

20న జాబ్ మేళా 7

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'
-సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి
8

రేపు జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలను ఈ నెల 19న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని మానేరు కట్టపై ఉదయం 8 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కదారి రవి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీస్తున్న ఆశావర్కర్లు

సుభాష్‌నగర్, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని ఆశా కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు నిర్వ హిస్తున్న బస్సు జాతా మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కళా ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 నుంచి 31 వరకు బస్సు జాతా నిర్వహిస్తున్నామన్నారు. ఆశాల శ్రమను ప్రభు త్వం గుర్తించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా స్కీం వర్కర్ల సమస్యలపై సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడిచినా 45వ లేబర్ కమిషన్ సిఫార్సులను మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ఆశాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, కోశాధికారి జి రాజేశం, సహాయ కార్యదర్శి యు శ్రీనివాస్, పున్నం రవి, నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య, ఆశా యూనియన్ అధ్యక్షురాలు రంగరవేణి శారద, ఉపాధ్యక్షులు రాజమణి, శంకరమ్మ, ప్రియాంక, లక్ష్మి, సరిత పాల్గొన్నారు.



గుంతలమయంగా మారిన బోయవాడ రోడ్డు

ఈ రోడ్లకు గ్రహణం వీడేదెన్నడో?

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని డివిజన్లలోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. నగర నడిబొడ్డున వాణిజ్య, వ్యాపార కేంద్రమైన 49వ డివిజన్‌లోని సిక్కువాడి, బోయవాడ లింక్‌రోడ్లతోపాటు 55వ డివిజన్ మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కమల్‌జిత్‌కౌర్ సోహెన్‌సింగ్, పెద్దపల్లి జితేందర్ ఇద్దరు కూడా పాలకవర్గం కొలువుతీరిన నాటి నుంచి రోడ్ల కోసం పోరాడుతూనే ఉన్నారు. మున్సిపల్ పాలకవర్గ సమావేశాల్లోనే కాకుండా పలు సందర్భాల్లో రోడ్ల కోసం ఆందోళనలు చేశారు. మరో 45 రోజుల్లో వారి పదవీకాలం ముగియనుంది. ఇప్పటికీ రోడ్లు అభివృద్ధి విషయంలో ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు.



అధ్వానంగా జ్యోతినగర్ వెళ్లే రోడ్డు

● టెండర్లు నిర్వహించినా ప్రారంభంకాని పనులు

49వ డివిజన్‌లోని గురుద్వార, బోయవాడ రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. రోడ్లను బాగుచేయక పోవడంతో స్థానికులతో పాటు జిల్లానలుమూలల నుంచి వచ్చే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జనరల్ ఫండ్‌తో ఈ రెండురోడ్లకు దాదాపు 90 లక్షలతో టెండర్లు నిర్వహించినా పనులు మాత్రం ప్రారంభించలేదు. 55 వ డివిజన్ పరిధిలోని మంకమ్మతోట నుంచి శ్రీరాంబుక్‌స్టాల్ ఎదురుగా జ్యోతినగర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. రోడ్డు బాగు చేయాలని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ అనేక మార్లు ఆందోళన చేపట్టిన ఆ రోడ్డుకు ఇప్పటికీ మోక్షం కలుగలేదు. పలు సందర్భాల్లో మాజీ మంత్రి, మేయర్, కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లడంతో 2023 అక్టోబరులో సీఎం హామీ నిధులు 2 కోట్లను కేటాయించి పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేదు. గత ఏడాది డిసెంబరు 8న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నగరంలోని పలు డివిజన్లలో లింక్ రోడ్లు వివిధ కారణాలతో నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను బాగు చేయాలని కార్పొరేటర్లు, ప్రజలు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించాలి

- కమిషనరేట్ వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ ప్రాధాన్యాన్ని పెంచాలి
- నేర సమీక్షా సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి, పక్కన ప్రొబేషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించే విధంగా పోలీసుల చర్యలుండాలని, విజిబుల్ పోలీసింగ్ ప్రాధాన్యాన్ని పెంచాలని పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ అధికారులందరికీ పలు కీలక సూచనలు చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ విధులను మరింత మెరుగు పరిచామన్నారు. నైట్ డ్యూటీ ఆఫీసర్, రౌండ్ ఆఫీసర్, పెట్రోలింగ్ ఆఫీసర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను నియమించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా మన్నారు. ఇటీవల అక్రమ గంజాయి రవాణా, వాడకం పెరిగిపోతున్నందున దానిని అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా కమిషనరేట్ స్థాయిలో నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. దాని సహాయంతో క్షేత్రస్థాయిలో దృష్టి కనబరచి ఎన్‌డీపీఎస్ యాక్ట్ ద్వారా కేసులు నమోదు చేయాలన్నారు. గంజా యిని పట్టుకున్న సమయంలో వారిపై నమోదు చేసిన కేసు వీగిపోకుండా, నిందితుడికి శిక్ష పడేవిధంగా టీజీనాబ్ జారీచేసిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. సైబర్ నేరా లు పెరిగిపోతున్నందున వాటి నియంత్రణ, అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ స్టేషన్ల వారీగా సైబర్ వారియర్లను నియమిం చామన్నారు. సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే వారు స్పందించి, బాధితులకు సహకరించి 1930కి, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కు సమాచారం అందించి అకనాలెడ్జ్‌ను పొందాలన్నారు. దాని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి తెప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేరం జరిగిన మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటామని, ఆ సమయంలో వెంటనే అప్రమత్తమై ఫిర్యాదు చేయడం ద్వారా కోల్పోయిన సొత్తును పొందే అవకాశాలు ఎక్కువగా వుంటాయని తెలిపారు. కమిషనరేట్ స్థాయిలో సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యాలయం ఎప్పటి కప్పుడు కమిషనరేట్ స్థాయిలో జరిగే నేరాలను అడ్డుకట్టవేసేందుకు పనిచే స్తుందన్నారు. గ్రామాలు, వార్డులను సందర్శించి ప్రజలతో సమావేశమయ్యే సందర్భంలో స్థానికంగా వుండే అక్రమ కార్యకలాపాలపై ఆరా తీయాలన్నారు. పోలీస్ చర్యలు క్షేత్రస్థాయిలో ఫలితాల నిచ్చే విధంగా ఉండాలని సూచించారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంబంధిత ప్రాంతాల్లో శాంతి భద్రతల సమస్యలు ఉన్నట్లయితే వాటిని అరికట్టేందుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను గమనించాలన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు ఠాణాల వారీగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు కారణాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీని వాస్, నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్ జి, విజయ్‌కుమార్, వేణుగోపాల్, కాశయ్య, మాధవి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): లగచర్ల రైతులపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందన్నారు. పేద దళిత గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు బండారి వేణు, కంసాల శ్రీనివాస్, గందె మాధవి, మహేష్, జంగిలి సాగర్, దిండిగాల మహేష్ పాల్గొన్నారు.



కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పాల్గొన్న నాయకులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమను ఆదుకోవాలని మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ప్రెస్ భవ న్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచుల బిల్లు లు విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిం చిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్‌సీ నిధులు రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయ తీలకు విడుదల చేయలేద న్నారు. ఎంబీ రికార్డు చేసిన బిల్లులతో పాటు వోచర్ బిల్లులు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,200 కోట్ల రూపాయల బిల్లులు సర్పంచులకు రావాల్సి ఉందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమ యంలో సర్పంచుల బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారం లోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. గ్రామాల్లో కరోనా కట్టడికి పనిచేసి ప్రజలను కాపాడిన సర్పంచులను ఆదుకోవాలని కోరారు. బిల్లులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు

- రెండోరోజు వెయ్యి మంది క్రీడాకారుల హాజరు
- ఫుట్‌బాల్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు


కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చీఫ్ మినిస్టర్ కప్-2024 క్రీడా పోటీలు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్నాయి. మంగళ వారం జరిగిన పోటీలను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి బి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభిం చారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో హుజూరాబాద్ ప్రథమ స్థానం, కరీంనగర్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు, స్టేడియం వేదికపై బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో 40 మంది బాల బాలికలు పాల్గొన్నారు. అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో రామడుగు ప్రథమ, టీఎస్ ఎంస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కోరా పాఠశాల ప్రథమ, తిమ్మాపూర్ జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించాయి. కబడ్డీ పురుషుల విభాగంలో కరీంనగర్ అర్బన్ ప్రథమ, చిగురుమామిడి ద్వితీయ స్థానంలో నిలి చాయి. ఖో-ఖో పురుషుల విభాగంలో మానకొం డూర్ ప్రథమ, తిమ్మాపూర్ ద్వితీయ స్థానం సాధిం చాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, క్రీడా సంఘాల ప్రతినిధులు గిన్నె లక్ష్మణ్, వంగపల్లి సూర్యప్రకాశ్, మల్లేశ్‌గౌడ్, కడారి రవి, ఎండి వలీపాష, రవి, అంతడ్పుల శ్రీనివాస్, ఎండి యూనిస్ పాష, సీహెచ్ సంపత్‌రావు, సొల్లు సారయ్య, ఎ శంకరయ్య, కట్ట సంతోష్, రాజ్‌కు మార్, శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.



ఖో-ఖో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

● క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ పోటీలు

కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా, యువజనశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సఫియా, పి శిరీష పాల్గొన్నారు.



స్విమ్మింగ్‌పూల్ లోపల పేరుకుపోయిన నాచు



ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్న స్విమ్మింగ్‌పూల్ గద్దెలు

మురికి స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు

జిల్లా కేంద్రంలో సీఎం కప్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు నిర్వహిస్తున్నారు. ఆ పూల్ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. అడుగుభాగంలో మట్టి, నాచు పేరుకుపోయింది. దానిని శుభ్రం చేయకుండా పోటీలు నిర్వహిస్తున్నారు. పూల్ వద్ద ఉన్న దిమ్మెలు చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. క్రీడాకారులు నిలుచుంటే కూలిపోయే ప్రమాదం ఉంది. శుభ్రంగా లేని స్విమ్మింగ్ పూల్‌లో పోటీలు నిర్వహిస్తుండడంతో క్రీడాకారులు చర్మవ్యాధుల బారినపడే అవకాశం ఉంది. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి కరీంనగర్
- కరీంనగర్ క్రైం (ఆంధ్రజ్యోతి)



స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌కు చెందిన బట్టల వ్యాపారి ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన ఇప్పలపెల్లి మల్లేశం(53) గ్రామాల్లో బట్టలు విక్రయిస్తుండేవాడు. వ్యాపారం సరిగా నడవక అప్పులు పెరిగాయి. మంగళవారం ఉదయం గంగాధర రైల్వే లైనుపై మల్లేశంను రైలు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు.భార్య శంకరవ్వ ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● ఏడుగురి పట్టివేత ● రూ.10,480, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం


సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి శివారు ప్రాంతంలో రహస్య పేకాట శిబిరంపై రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నామని, వారి నుంచి పది వేల నాలుగు వందల ఎనభై రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వీరిని తదుపరి విచారణ నిమిత్తం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పంజాల చంద్రయ్య అనే గీత కార్మికుడు వృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ఈనెల 12న ఓ దుకాణం ఎదుట ఉంచిన దాసరి అజయ్‌కుమార్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పెరుగుపల్లికి చెందిన అజయకుమార్ ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు.


కళాశాల అద్దె భవనం

మూగబోతున్న స్వరాలు


సాధన చేస్తున్న విద్యార్థి


వినియోగం లేక మూలన పడ్డ వీణలు

సంగీత కళాశాలలో సమస్యల తిష్ఠ

రెండున్నర దశాబ్దాలుగా లెక్చరర్ల పోస్టులు ఖాళీ

అరకొరగా వసతులు.. నామమాత్రంగా ప్రవేశాలు

మంథని ప్రభుత్వ సంగీత కళాశాల దుస్థితి

మంథని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆసక్తి, అభిలాష కలిగిన యువతను సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దాల్సిన మంథని సంగీత కళాశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి.. సంగీతాన్ని బోధించే గురువులు లేక వాయిద్యాలన్నీ దశాబ్దాలుగా గదుల్లోనే బందీలవుతున్నాయి. మంథనిలోని సంగీత కళాశాల నిర్వహణకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడం లేదు. గత ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం సప్తస్వరాలతో కళకళలాడాల్సిన మంథని సంగీత కళాశాల కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ సంగీత కళాశాల నిర్వాహణను రెండున్నర దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. హైదరాబాద్‌లో మూడు, వరంగల్, నిజామాబాద్, మంథనిలో ఒక్కొటి చొప్పున తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఆరు మాత్రమే ప్రభుత్వ సంగీత కళాశాలున్నాయి.

గతమెంతో ఘనం..


వేద విద్యకు నిలయమైన మంథనిలో మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు ప్రత్యేక చొరవతో 1992లో ప్రభుత్వ సంగీత కళాశాలను మంజూరుచేయించి స్వయంగా ప్రారంభించారు. కళాశాలలో హిందూస్థానీ, కర్నాటక ఓకల్, సితార, వీణా, వాయిలిన్, మృదంగం, కూచిపూడి విభాగాల్లో కోర్సులను ప్రారంభించారు. ఆయా విభాగాల్లో కోర్సు బోధించడానికి లెక్చరర్లతో పాటు మృదంగం, తబలా, గామక్ విభాగాల్లో మరో సహాయక పోస్టులను మంజూరు చేశారు. రెండు సంవత్సరాల పాటు అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 500 మంది అభ్యర్థులు కళాశాలలో విద్యార్థులుగా చేరి సంగీత సాధన ప్రారంభించారు. అయితే మంథని పట్టణ ప్రాంతం కాకపోవడంతో ప్రైవేట్ క్లాసుల ఇన్‌కం లేక సంగీత కళాశాలలో పని చేస్తున్న చాలా మంది లెక్చరర్లు 1994 తర్వాత పైరవీలతో డిప్యూటేషన్‌పై వెళ్లి ఆ తర్వాత బదిలీ చేయించుకున్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సైతం డిప్యూటేషన్‌పై వెళ్లి పోయారు.

కర్ణాటక ఓకల్, మృదంగం, పేరిణి విభాగాల్లో సాధన..

సంగీత కళాశాలలో ప్రస్తుతం కర్ణాటక గాత్రం, మృదంగం, పేరిణి విభాగాల్లో మాత్రమే కాస్లులు జరుగుతున్నాయి. ఇటీవల ప్రిన్సిపాల్‌గా నియమితులైన శారద కర్ణాటక ఓకల్ విభాగాన్ని ప్రారంభించారు. సర్టిఫికెట్, డిప్లామా కోర్సుల్లో ఐదుగురి వరకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన ఇదే కళాశాల పూర్వ విద్యార్థి జంబోజు రాజేశం మృదంగం విభాగాన్ని దాదాపు 10మంది విద్యార్థులకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన పేరిణి నృత్యాన్ని కుమార్ 8 మంది విద్యార్థులకు సాధన చేయిస్తున్నారు. అయితే సంగీత కళాశాలలో లెక్చరర్లు లేని కారణంగా అనేక కోర్సులు అందుబాటులో లేకుండా పోయాయి. హిందూస్థానీ ఓకల్, సితార, వీణా, వాయిలిన్, కూచిపూడి విభాగాల్లో కోర్సుల్లో సాధన పూర్తిగా కనుమరుగైపోయింది.

● సొంత భవనం కరువు..

మంథనిలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రారంభమై దాదాపు 30 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి సొంత భవనం లేదు. నాటి నుంచి నేటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయించి సంగీత కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని సంగీతాభిమానులు కోరుతున్నారు.




సాధన చేస్తున్న విద్యార్థులు

పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి..

శారద, ప్రిన్సిపాల్, సంగీత కళాశాల, మంథని.



మంథని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేస్తాను. ఇటీవలనే ప్రిన్సిపాల్‌గా చార్జి తీసుకున్నాను. త్వరలోనే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సంస్థ డైరెక్టర్‌లను కలిసి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచటానికి కూచిపూడి నృత్యం, తబలా, వయోలిన్, వీణ లాంటి కోర్సులు బోధించడానికి లెక్చరర్ల పోస్టులు మంజూరు చేయాలని, సొంత భవనం నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తాను. అందరి సహకారంతో కళాశాలను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తాను.

కళాశాల మూతపడవద్దనే పని చేస్తున్నా..

తాత్కాలిక మృదంగం అధ్యాపకుడు రాజేశం



మంథనిలో సంగీత కళాశాల మూతపడవద్దనే తాత్కాలికంగా మృదంగం అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు మృదంగం నేర్పిస్తున్నాను. ఇదే కళాశాలలో నేను మృదంగంలో డిగ్రీ కోర్సు పూర్తి చేశాను. మళ్లీ ఇక్కడే విద్యార్థులకు 15 ఏళ్ళుగా మృదంగం నేర్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది. కళాశాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకురావటానికి నావంతు సహకారం అందిస్తా.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎండపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మండలంలోని సూరారం గ్రామంలో ఏపీ 29 బీఎస్ 4853 నెంబర్ గల కారు బసంత్‌నగర్ నుంచి రాజారాంపల్లి వైపు వస్తున్నది. అదే క్రమంలో కారు ముందు ద్విచక్రవాహనంపై సబ్బులు అమ్ముకునే గుర్తుతెలియని యువకుడు మారేడుపల్లి నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనకనుంచి కారు ఢీకొట్టంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన నీలం అనిల్, అతని భార్య, ఇద్దరు పిల్లలు కారులో ఉన్నారు. పాప చెవికి కూడా గాయమైంది. గాయపడిన గుర్తుతెలియని యువకుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఇద్దరి మృతికి కారణమైన కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సింగరవేణి కిషన్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు 18నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 12 జనవరి 2014న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గడిపల్లి మల్లేశం, తాటకర్ల శంకర్‌పైకి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపడంతో ఇద్దరూ మృతిచెందారు. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై మాలకొండరాయుడు కిషన్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న టుటౌన్ సీఐ ప్రమోద్‌రావు

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని రెండు నెలలుగా మోసాలకు పాల్పడుతున్న అల్లూరు రాజీవ్‌నగర్ తండాకు చెందిన ధరావత్ రాజేష్ నాయక్‌ను అరెస్టు చేసినట్టు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజేష్ నాయక్ అరెస్టు వివరాలను సీఐ ప్రమోద్‌రావు వెల్లడించారు. అన్నపూర్ణ ఫుడ్స్ కంపెనీలో నెలకు పదివేల రూపాయల జీతం వస్తుందని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2600 నుంచి రూ.5200వసూలు చేస్తూ, స్థానిక సదానందం థియేటర్‌ను లీజుకు తీసుకొని అమాయక ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరపగా రాజేష్ నాయక్ బీజేపీ పేరు చెప్పి ప్రభుత్వ స్కీములను ఇప్పిస్తానని ప్రజలను మోసం చేస్తున్నట్టు గుర్తించినట్టు సీఐ పేర్కొన్నారు.

భార్యను వేధించిన కేసులో 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌కు చెందిన షేక్ నవాజ్‌కు 18నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన అఫ్రీన్‌ను ఆమె భర్త నవాజ్, బంధువులు అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడికి 18నెలల జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించారు.

హాస్టల్ నుంచి పారిపోయిన బాలుడు

● గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన నాంపల్లి శ్రీరామన్ (17) అనే బాలుడు పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్ గేటు దూకి పారిపోయాడు. పోలీసులు పది గంటల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి శ్రీరామన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ గేట్ దూకి పారిపోయినట్లు పాఠశాల యాజమాన్యం గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలుడి తండ్రి నాంపల్లి లక్ష్మీనర్సయ్య వెంటనే మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి మిస్సింగ్ కేసు నమోదు చేసి మెట్‌పల్లి ఎస్‌ఐతో పాటు పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీఐ ఆదేశాలతో పోలీస్‌లు రెండు బృందలుగా ఏర్పడి ఒక బృందం జగిత్యాల వైపు, మరో బృందం నిజామాబాద్ వైపు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు హాస్టల్ వార్డెన్ ఫోన్‌ను తీసుకెళ్లడంతో సీడీఆర్ టెక్నాలజీని ఉపయోగించి పారిపోయిన బాలుడు పెద్దపల్లి జిల్లా కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్టు గుర్తించి వెంటనే పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్‌కు సమాచారం అందించి బాలుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అబ్బాయి శ్రీరామన్‌ను పది గంటల్లోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అభినందించారు.

ముమ్మరంగా సూరమ్మ మత్తడి నిర్మాణ పనులు

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట సూరమ్మ చెరువు మత్తడి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-2, ఫేజ్-1లో భాగంగా సుమారు ఆరు కోట్ల రూపాయల అంచనాతో పనులు చేపడుతున్నారు. బీవీఆర్‌ఎస్‌ఎల్ కంపెనీ సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా మత్తడి, కొత్త తూము నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌తో వేగవంతంగా పనులను చేపడుతున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చలు కొనసాగిస్తున్నారని తెలిసింది. .

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు


అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిల్లపాపలను, పాడిపంటలను చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండి డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులు నెత్తిన బోనంతో సుమారుగా రెండు గంటలపాటు నిరీక్షించారు. ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇన్‌చార్జి శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా విద్యాశాఖాధికారిపై ఆర్జేడీ విచారణ


డీఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారిపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి డీఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో జరిగిన అవతవకలపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు వి.రాజిరెడ్డి, ఆవాల నరహరి, తూముల తిరుపతి, పి దామోదర్‌రెడ్డి, జె రామచంద్రారెడ్డి, వి బాలయ్యలు ఆర్జేడీకి వివరించారు. డీఈవో పుట్టిన తేదీపై, బీఈడీ అర్హతలపై గతంలో వచ్చిన అభియోగాలు, అనవసరపు ఫార్మాట్లు రూపొందించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచుతున్నారని ఆర్జేడీకి వివరించినట్లు తెలిసింది. పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో వివిధ సబెక్టుల్లో జరిగిన అవకతవకలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. 317 జీవో అమలులో జరిగిన అవకతవకలను, కొంత మంది ప్రధానోపాధ్యాయులను తరచుగా ఆన్‌డ్యూటీ పేరిట డీఈవో కార్యాలయానికి రప్పిస్తున్నారంటూ డీఈవోపై ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. డీఈవో కార్యాలయంలో లెక్కకు మించి నాన్ టీచింగ్ స్టాఫ్‌ను వివిధ పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై నియమించడంపై ఫిర్యాదు చేశామన్నారు. డీఈవో ఏ రోజు కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని, దీనితో ఫైల్స్ క్లియర్ చేయడంలో జాప్యమవుతోందని సంఘ నాయకులు ఆర్జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బంగారం కడిగి ఇస్తామని అపహరణ


నకిలీ పుస్తెల తాడు


బాధితురాలు నక్క జమున

కోరుట్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత్రలకు పూతలు వేసి.. బంగారం కడిగి ఇస్తామని మహిళను మోసం చేసి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన మండలంలోని నాగులపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పాత్రలకు పూతలు పెట్టి, బంగారం కడిగి ఇస్తామంటూ గ్రామంలో సంచరిస్తూ గ్రామ పంచాయతీ సమీపంలోని బాధితురాలు నక్క జమున ఇంటికి వెళ్లారు. జమునతో ఇంట్లోని బోళ్లను పూత పెడుతామని.. బంగారం కడిగి ఇస్తామని తెలపడంతో ఇంట్లో ఉన్న బోళ్లను బాధితురాలు గుర్తు తెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బోళ్లను శుభ్రం చేస్తూ తన మెడలో ఉన్న బంగారం కడిగి ఇస్తామని నమ్మించారు. వెంటనే ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడుతో పాటు మరో బంగారు ఆభరణాన్ని గుర్తుతెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బంగారం శుభ్రం చేశామని నకిలీ ఆభరణాన్ని జమునకు అందించి ఇంట్లో ఉన్న పసుపులో పెట్టుకొని అరగంట తరువాత తీసుకోవాలని సూచించి అక్కడి నుంచి వారు జారుకున్నారు. అరగంట అయిన తర్వాత పసుపులో పెట్టిన బంగారం చూడగా అది బంగారం కాదని తెలుసుకుని లబోదిబోమంది. చుట్టు పక్కల వారికి విషయం తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర విశ్వవిద్యాలయాల స్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన గుర్రాల ఆకాష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మనవేణి కుమార్ తెలిపారు. ఈనెల 18 నుంచి 22వరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున ఆకాష్ ఆడనున్నారు. ఆకాష్ వివేకనంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆకాష్‌ను ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, వైస్ చైర్మన్ లింగయ్య, పాక్స్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, మాజీ సర్పంచ్ జానకీ శంకర్, తదితరులు అభినందించారు.


గుర్రాల అకాష్

రాష్ట్రస్థాయి సీఎం కప్ కోకో పోటీలకు ఎంపికైన విద్యార్థిని

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మనగర్ గ్రామం ఎల్‌ఎండి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కే. సంధ్య రాష్ట్ర స్థాయి సీఎం కప్‌లో కోకో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా స్థాయి కోకోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంధ్యను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిడి.బన్సిలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థిని సంధ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పంప్‌హౌస్ ప్రాంతంలో పులి సంచార వదంతులు

మల్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాంపూర్ శివారులో పులులు సంచరించించాయనే వదంతులు ఈ ప్రాంతవాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇక్కడికి సమీపంలో రాంపూర్, ఓబులాపూర్, గొర్రెగుండం అటవీ ప్రాంతం ఉండడం, మేడిపల్లి మండలం కాసారం వరకు అడవి విస్తరించి ఉంది. కొన్నాళ్ల క్రితం కాసారం వైపు వెళ్లే మార్గంలో గల గుట్టల్లో పులి కనిపించిదని వదంతులు వ్యాపించాయి. తాజాగా మంగళవారం వేకువజామున రాంపూర్ పంప్ హౌస్ సమీపంలో మూడు పెద్ద పులులు కనిపించాయని కొందరు సోషల్‌మీడియాలో వదంతులు వ్యాపింపచేశారని రాంపూర్‌వాసులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్నిరోజులుగా సోషల్‌మీడియాలో పులులు సంచార వదంతులతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీట్ అధికారి వసీంను సంప్రదించగా పులి సంచార వదంతులను ప్రజలు వాటిని నమ్మవద్దని సూచించారు.

గంజాయి మొక్కలు పట్టివేత

ముత్తారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కాలనీకి చెందిన ఓ వ్యక్తి బంతిపూల మొక్కలతో పాటు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు నిర్ధారణ చేసుకొని అటవీశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం ఇంటిపై దాడి చేసి మొక్కలను పట్టుకున్నారు. సుమారు 23 మొక్కలు సాగు చేసినట్లు సమాచారం.

ఇరిగేషన్ అధికారుల విచారణ

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరు, బొమ్మెన వాగులు ఆక్రమణకు గురవుతన్నాయని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

వీర్నపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :వీర్నపల్లి మండలం భూక్యాతండా పరిధిలోని రాశిగుట్టతండాలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన వంతెన అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసంపై పీఆర్ ఏఈ శ్రీనివాస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపగా శిలాఫలకం ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

అసెంబ్లీలో మన నేతలు

మిడ్ మానేరులో సీప్లేన్ ఏర్పాటు చేయాలి

● శాసనసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి అత్యంత సమీపంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాడు శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారని, వేములవాడకు కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేయవచ్చని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుంచి శ్రీశైలంకు సీ ప్లేన్ సౌకర్యం ఏర్పాటు చేశారని, అదే తరహాలో మిడ్ మానేరు ప్రాజెక్టులో గానీ, లోయర్ మానేరు ప్రాజెక్టులో గానీ సీప్లేన్ సౌకర్యాన్ని కల్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని ఆది శ్రీనివాస్ కోరారు. సీ ప్లేన్‌తో పాటు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను కూడా పరిశీలించాలని తద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నాంపల్లిగుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వదిలేసిందని, రోప్ వే ఏర్పాటుకు గల అవకాశాలను సైతం ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. మిడ్ మానేరులో సీప్లేను, బోటింగ్, నాంపల్లి గుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగం మరింత ఊపందుకుంటుందని ఆయన అన్నారు.

రాజన్న భక్తులకు అదనంగా బస్సులు కేటాయించాలి

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారని, భక్తుల సౌకర్యార్థం నూతనంగా డిపోకు అదనపు బస్సులు కేటాయించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అసెంబ్లీలో టీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కోరుట్ల నుంచి వేములవాడకు హైదరాబాద్ నుంచి వచ్చే చివరి బస్సుల సమయాన్ని పెంచాలని సూచించారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

● అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గానికి భారీ ఎత్తున నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని, రైతులు 90 శాతం మంది ఆధారపడి ఉన్న ప్రాంతమని ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆయన ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఆవశ్యకత గురించి ఆయన ప్రస్తావించారు. గతంలో ఈ ప్రాంత ప్రజల కోరిక గురించి ప్రభుత్వంలో ఉన్న పెద్దల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో పలుమార్లు ప్రజలు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయగా ప్రతి ప్రక్షంలో ఉన్న తాము కూడా ధర్నాలో పాల్గొన్నామని ఆయన తెలిపారు. ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు అన్నివిధాల అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత మంత్రి వెంటనే ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు.





● కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన ఒక యువకుడి మొబైల్‌ఫోన్‌కు గుజరాత్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే సైబర్ నేరగాడు మెస్సేజ్, పైగోల్డ్ పేరిట యూట్యూబ్ లింక్‌లను పంపించాడు. బంగారం, ఎక్స్ఆర్‌పీ సంస్థలో పెట్టుబడులు పెడితే త్వరగా రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు. వీటిని నమ్మిన ఆ యువకుడు ఆ లింక్‌తో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అతని బ్యాంక్ ఖాతా నుంచి పలు మార్లు 33.63 లక్షల రూపాయలు సైబర్ నేరస్తుడు పంపించిన ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనుమానం వచ్చి ఆ ఖాతా లను పరిశాలించగా ఫేక్ ఖాతాలుగా నిర్ధరణ అయి కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు విచారణ చేపట్టేసరికే ఆ ఖాతాల్లోని డబ్బులు విత్‌డ్రా అయ్యాయి.

ఆలస్యం.. అమృతం.. విషం

● సైబర్ మోసాలపై సత్వరమే స్పందించాలి

● గోల్డెన్ టైంలో ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరం జరిగిన తరువాత సాధ్యమైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఇలా ఫిర్యాదు చేస్తే ఇతర ఖాతాలకు బదిలీ అయిన డబ్బును హోల్డ్‌లో పెడతారు. విచారణ అనంతరం బాధితులకు డబ్బులు అందజేస్తారు. నేరం జరిగిన తర్వాత స్పందించే సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారు. గతంలో గంటలోపు ఉండే సమయం ప్రస్తుతం నిమిషాల్లోకి మారింది. ఆ గోల్డెన్ అవర్ కాస్త గోల్డెన్ టైంగా మారింది. సైబర్ నేరం జరిగిందని గుర్తించిన వెంటనే స్పందించి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

సైబర్ మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్

సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి 1930 టోల్‌ఫ్రీం నంబరు ఉంది. ఈ కేసులను ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐసీసీసీ) పర్యవేక్షిస్తుంటుంది. దేశంలో ఏ రాష్ట్రం, ఏ ప్రాంతం నుంచి సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి కాల్ వచ్చినా అక్కడి అధికారులు స్పందించి వివరాలను నమోదు చేసుకుంటారు. 24 గంటలు ఈ టోల్‌ఫ్రీ నంబరు పని చేస్తుంది. ఒక సైబర్ మోసం జరిగినట్లు ఫిర్యాదు రాగానే ఆ బాధితుడు ఇచ్చిన ఖాతా నంబరు ఆధారంగా వెంటనే ఆ ఖాతాను ఫ్రీజ్ చేస్తారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కోర్టులో సమాచారం అందించి, కోర్టు ఆదేశాలతో నేరస్థుడి ఖాతా నుంచి ఆ డబ్బులను బాధితుడి ఖాతాకు జమ చేస్తారు. ఐసీసీసీకి దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంక్‌లు అనుసంధానమై ఉంటాయి. ఆయా బ్యాంక్‌ల నోడల్ ఆఫీసర్లు నిత్యం ఈ సైబర్ కేసులను పరిశీలిస్తూ, వారి బ్యాంక్‌లకు సంబంధించిన కేసు నమోదైతే వెంటనే ఆ ఖాతాలను హోల్డ్‌లో పెడుతారు. బాధితులు మోసం జరిగిన వెంటనే సాధ్యమైనంత వరకు తక్కువ సమయంలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీం 1930కు సమాచారం అందించాలి. బాధితుడి పేరు, ఇతర వివరాలతోపాటు తన బ్యాంక్ ఖాతా నంబరు, తేదీ, సమయం, డబ్బులు ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన ఐడీ, స్క్రీన్‌షాట్, సైబర్ నేరగాళ్లు పంపించిన లింక్ లేదా మెస్సేజ్ వంటి వివరాలను అందించాలి.



కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణా

● కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడి టెలిగ్రాం అకౌంట్‌కి క్రిప్టో కరెన్సీకి సంబంధించిన ఒక ప్రొఫైల్ వచ్చింది. దీనిని ఓపెన్ చేయగా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపుకావటంతోపాటు మరి కొన్ని బహుమతులు గెలుచుకునే అవకాశముందని రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడు 1.6 లక్షల రూపాయలు ఫోన్‌పే ద్వారా నేరస్థుడి ఖాతాకు పంపిం చాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాప్ రావటంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే నిందితుడు తన ఖాతాలోని డబ్బులను విత్‌డ్రా చేశాడు.





● ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక ఉద్యోగి సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కి లక్ష రూపాయలు గుర్తుతెలియని ఖాతాకు పంపించాడు. మోసానికి గురయ్యానని తెలుసుకున్న వెంటనే నిమిషాల వ్యవధిలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి డబ్బులు జమ అయిన ఖాతాను హోల్డ్‌లో పెట్టి బాధితుడికి న్యాయం చేశారు.

ఏపీకే లింక్‌లు ఓపెన్ చేయొద్దు..

వరాల నర్సింహారెడ్డి, కరీంనగర్ సైబర్‌క్రైం డీఎస్పీ



మొబైల్‌ఫోన్‌కు వచ్చే గుర్తుతెలియని ఏపీకే లింక్‌లను తెరవొద్దు. క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు. సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లను మాత్ర మే ఉపయోగించాలి. కొత్త నంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్, వాట్సప్ కాల్స్ రిసీవ్ చేసుకోవద్దు. మోసాలబారిన పడకముందే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందించాలి. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం వల్ల నేరస్థుల ఖాతాలను ఫ్రీజ్ చేసి, పోయిన డబ్బులు తిరిగి రాబట్టేందుకు అవకాశం ఉంటుంది.

మాల కులస్థులపై దుష్ప్రచారం మానుకోవాలి

ఇల్లందకుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులపై మాదిగలు చేసే దుష్ప్రచారాన్ని మానుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మాలలు ఎన్నడు వ్యతిరేకం కాదని, వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ వ్యవస్థను తీసుకువస్తారని తెలిపారు. క్రిమిలేయర్ వ్యవస్థ ద్వారా రాబోయేరోజుల్లో ముందు తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కనుమల్ల రామకృష్ణ, బోగం చిరంజీవి ఉన్నారు.

కోడెల పంపిణీకి అనుమతి తప్పనిసరి

● ప్రతి రోజూ కోడెల వివరాలు రిపోర్ట్ చేయాలి ● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ● వేములవాడ ఆలయ గోశాల నిర్వహణపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న దేవాలయం గోశాలకు సంబంధించిన కోడెల పంపిణీకి కలెక్టర్ అనుమతి తప్పనిసరని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ ఆలయ గోశాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ గోవులను పంపిణీ చేసేందుకు వీలులేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1975 కోడెలు, ఆవులను గోశాల నుంచి పంపిణీ చేశామని, వీటిలో మొదటి దశలో 1278 కోడెలు, 75 ఆవులు, రెండో దశలో 389 కోడెలు, 45 ఆవులు, మూడో దశలో 188 కొడెలు పంపిణీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొదటి, రెండు దశలకు మాత్రమే కలెక్టర్ అనుమతి తీసుకున్నారని, మూడో దశ మాత్రం అనుమతి లేకుండా ఎలా పంపిణీ చేశారని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రశ్నించారు. మూడో దశ పంపిణీకి గల కారణాలపై సమగ్ర నివేదిక అందించాలని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో పంపిణీ చేసిన 1975 కోడెలు, ఆవుల స్థితి గతులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంపిణీ చేసే సమయంలో వాటికి ట్యాగ్ ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం పోలీస్ సిబ్బంది విచారించి ఎంపిక చేసే వరకు ఏ లబ్ధిదారుడికీ గోశాల నుంచి కోడెలు, ఆవులను ఇతర జిల్లాలకు పంపిణీ చేసేందుకు వీలు లేదన్నారు. ప్రతీ రోజు వేములవాడలోని 2 గోశాలలు, ఆలయ ఆవరణలో కోడెలు, ఆవుల వివరాలు తెలియ జేయాలన్నారు. లబ్ధిదారుల జాబితాపై కలెక్టర్ సంతకం లేనంత వరకు అది ఫైనల్ కాదని స్పష్టం చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతీ వారం సమీక్ష సమావేశం ఉంటుందని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరగాలని అన్నారు. ఎక్కడా అవకతవకలు ఉండడానికి వీలులేదని, ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం తన దృష్టికి రావాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవో రాజేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఆర్వో శ్రీధర్, వేములవాడ తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

కబేళాలకు కోడెల తరలింపుపై భక్తుల ఆవేదన

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



వేములవాడలో శాంతిహోమంలో పాల్గొన్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న కోడెలను కబేళాలకు తరలించడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. రాజన్న కోడెలను గీసుకొండలో కబేళాలకు తరించడంపై వేములవాడ పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి శాంతిహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కాదని, కాసుల సురేఖ అని మహాశివుడి శాపానికి గురికాక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా మంత్రి కొండా సురేఖ అనుచరులు రాజరాజేశ్వరస్వామి కోడెలను కబేళాలకు తరలిస్తున్నారన్నారు. కోడెల ఆత్మశాంతి కోసం శాస్త్రీయత ప్రకారం శాంతి హోమం నిర్వహించామన్నారు. నిజకోడెను స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నట్లు వివరించారు. ఏ పార్టీ ముఖ్యమంత్రి అయినా ఆలయాల విశిష్టతను కాపాడేందుకు కృషి చేస్తారన్నారు. రాజన్నకు కోడె చెల్లించుకుంటే పరమేశ్వరునికి చెందుతుందని, భక్తులు విశ్వసించేవారని, ఇప్పుడు కోడె చెల్లించుకుంటే మంత్రి షెడ్డులోకి పోతున్నాయని పలువురు మాట్లాడుకుంటున్నారని అన్నారు. ఓరుగల్లు పేరును కాపాడాల్సిన మంత్రి అనుచరుల చేత కోడెలను కబేళాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కాశీకి పోయినా, గంగాలో మునిగినా ఈ పాపం పోదన్నారు. కాసుల కోసం కోడెలను అమ్మిన కసాయి సురేఖ అని ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి తప్పినందుకే ములుగులో భూమి కంపించిందని, చెట్లు నేలమట్టమయ్యాయని అన్నారు. రాజన్న కోడెలను కబేళాలకు తరలించిన ఘటనపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్ తదితరులు ఉన్నారు.

అంకాపూర్, ములుకనూర్‌లకు దీటుగా లక్ష్మీపూర్

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం వద్ద రైతులతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆదర్శగ్రామాలుగా ఉన్న అంకాపూర్, ములుకనూర్లకు దీటుగా లక్ష్మీపూర్ నిలుస్తుందని, రైతులు సంఘంగా ఏర్పడి ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఏడీఏ అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. లక్ష్మీపూర్ రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఆహార ఉత్పత్తులుగా మార్చేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ వైపు దృష్టిసారించడమేకాకుండా, సేంద్రియ వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. ఆహార ఉత్పత్తులను బయటిదేశాలకు ఎగుమతి చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ సహకారసంఘం చైర్మన్ పన్నాల తిరుపతిరెడ్డి, యూత్ ఫర్ యాంటి కరప్షన్ సంస్థ ప్రతినిధి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం లేక మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు

కొడిమ్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు ఏడాది కాలంగా రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలువురు విద్యార్థులు గ్రామాల నుంచి ఆటో, వ్యాన్లలో పాఠశాలకు వస్తున్నారు. దీని కోసం ఒక్కొక్కరు నెలకు 1,000 రూపాయల నుంచి 1,500 రూపాయల వరకు చెల్లిస్తున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మండలంలోని నల్లగొండ, తిప్పయ్యపల్లి, చెప్యాల, పూడూర్, నాచుపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు కొడిమ్యాల బస్టాండ్‌లో దిగి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కు నడిచి రావటం ఇబ్బందిగా తయారైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మండల ప్రత్యేక అధికారిని కలిసి ఆర్టీసీ బస్సును మోడల్ స్కూల్ వరకు నడిపించాలని విద్యార్థులు కోరారు. గతంలో వేములవాడ నుంచి మోడల్ స్కూల్ వరకు నడిచిన ఆర్టీసీ బస్సు ఏడాదిగా నిలిచిపోవటంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు రాకపోవటంతో గత సంవత్సరం 393 మంది విద్యార్థులు ఉన్న సంఖ్య ప్రస్తుత్తం 295 మందికి తగ్గింది.

● పాఠశాల మైదానంలో బండరాళ్లు..

మోడల్ స్కూల్ మైదానంలో పెద్ద రాళ్లు ఉండటంతో క్రీడలకు ఆటంకంగా మారాయి. అంతే కాకుండా పాఠశాల మైదానంపై తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటం వాలీ బాల్ ఆడుతున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మైదానంలోని రాళ్లను తొలగించి, విద్యుత్ వైర్లను మార్చాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మోడల్ స్కూల్ వరకు ఆర్టీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బ్యాగులతో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

మోడల్ స్కూల్ వరకు బస్సును నడుపాలి

- లావణ్య, ప్రిన్సిపాల్



కొడిమ్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సును అధికారులు నడిపించాలి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు నడిచి రాలేకపోవటంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఏడాది కాలంగా ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవటం లేదు.

20న జాబ్ మేళా

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలు కల్పనకు ఈనెల 20న కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ దగ్గర ప్రభుత్వ ఈ-ఆధార్ సేవ కేంద్రం పై అంతస్థులో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ సంస్థలో 20ఫార్మసిస్ట్, 30సేల్స్ అసోసియేట్, 50 జూనియర్ అసిస్టెంట్, 15 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. సేల్స్ ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 20న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయానికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9392310323, 7207659969, 9908230384 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

జమ్మికుంటలో ఆరగంట ఆలస్యంగా డిగ్రీ పరీక్ష

జమ్మికుంట, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జరుగుతున్న ఐదవ సెమిస్టర్ ఇంగ్లీష్ పరీక్ష మంగళవారం ఆరగంట ఆలస్యంగా జరిగింది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా, సరిగ్గా ప్రశ్నాపత్రం ఇచ్చే సమయానికి కరెంట్ పోయింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. 8.50గంటలకు ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం ప్రింట్ తీసి విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంది. కరెంట్ పోవడంతో అధ్యాపకులు హైరానా పడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ హుటాహుటిన జనరేటర్ తెప్పించి ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రాలు ప్రింట్ తీసి విద్యార్థులకు ఇచ్చారు. అప్పటికి ఆరగంట గడిచిపోయింది. యూనివర్సిటీకి సమాచారం అందించడంతో అదనంగా మరో ఆరగంట సమయం కేటాయించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

నర్సరీలపై సమావేశం

సైదాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నర్సరీలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ నర్సరీలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 169క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అదేవిధంగా 290మంది రైతులు 4510క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

అయ్యప్ప ఆలయంలో భిక్ష

-దాతలు స్పందించాలని ఈవో వినతి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 17: భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో ఈయేడు కూడా దాతలు, భక్తులు, దీక్షాపరుల సహకారంతో ఉచిత తేనీరు, భిక్ష, అల్పాహారం ఏర్పాటు చేశారు. జనవరి 1వ తేదీ వరకు తేనీరు, అల్పాహారాన్ని అందించనుండగా భిక్షను జనవరి 8వ తేదీ వరకు కొనసాగించనున్నారు. రోజూ భిక్షకు 800 నుంచి 1000 మంది, అల్పాహారానికి 300 నుంచి 500 మంది, తేనీటికి 800 వరకు దీక్షాపరులు వస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి వస్తు, ధన రూపేణా సహకారం అందించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి కోరారు.

అలరించిన సంగీత విభావరి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి సందర్భంగా మంగళవారం కళాభారతిలో శారదా సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. జానపద, సినీ నేపథ్య గాయకుడు చంద్రతేజ సంగీ విభావరి ప్రేక్షకులను అలరించింది. కీబోర్డు గుర్రాల శ్రీధర్, తబలా బాలంపల్లి రమేష్, రిథమ్ ప్యాడ్స్ శ్రీరాముల రామచంద్రంలు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు బొజ్జ రేవతి, గాయకుడు కాసు మహేంద్ర రాజు, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ రొడ్డ యాదగిరి, వేములవాడ దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు రామయ్యశర్మ, నాట్యాచార్యుడు రతన్‌కుమార్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

కరీంనగర్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, చొప్పదండి మండలాల ఉపాధ్యాయులకు విద్యాబోధనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు నగునూర్ కాంప్లెక్స్ కేంద్రంగా కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. దుర్శేడ్ కాంపెక్స్ పరిధిలోని జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యధిక జీపీఏను ఎలా సాధించాలనే దానిపై రిసోర్స్ పర్సన్స్ ద్వారా చర్చించారు. మండల విద్యాధికారి రవీందర్ జీవ శాస్త్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంపెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకమని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారులు నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో కరీంనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ అభిషేక్ మొహంతి, ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెవిలు అతిథిగా హాజరయ్యారు. అతిథులకు రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పలువురు పోలీసు అధికారులు 35 నుంచి 40 సంవత్సరాలు సేవలు అందించి పదవీ విరమణ చేశారన్నారు. ఎన్నో సంఘ విద్రోహశక్తులకు ఎదురొడ్డి పోరాటం వల్లనే శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. కొంతమంది



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి, పక్కన టౌన్ ఏసీపీ నరేందర్

పోలీసు అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు సైతం కోల్పోయారని అన్నారు అటువంటి వారి సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. నూతనంగా పోలీసుశాఖలో చేరిన వారికి రిటైర్డ్ అధికారుల సేవలు ఆదర్శనీయమన్నారు. రిటైర్డ్ పోలీసు అధికారులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీపీ అన్నారు. ఇటీవల మరణించిన రిటైర్డ్ అధికారుల కోసం 2 నిమిషాలు మౌనం పాటించారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్‌లో చేరి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 40 మంది అధికారులను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ గోపతి నరేందర్, రెండో రాణా సీఐ విజయ్‌కుమార్, రిటైర్డ్ అధికారులు అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు రాజమౌళి, ముంతుజా, మల్లయ్య, లింగయ్య ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్‌లో మేయర్ యాదగిరి సునీల్‌రావు పర్యటించారు. కార్పొరేటర్ నుజహత్‌అలీతో కలిసి ఖాన్‌పురాలో ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్ పనులను భూమి పూజ చేశారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత వ్యవధిలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద ప్రజలు నివసించే డివిజన్లకు పెద్దఎత్తున నిధులు కేటాయించి మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు. ఇరుకుగల్లీలో ఓపెన్ డ్రైనేజీలు నిర్మించకుండా ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్ వేసి గల్లిని విస్తరించడంతో పాటు అపరిశుభ్రత, దోమల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మిగిలిన పనులన్నిటిని పాలకవర్గ పదవీ కాలం ముగిసే లోపు చేసేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

-ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ వారు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో ఆయా గ్రామాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల కార్యదర్శులు ఒకవైపు కుల గణనలో పాల్గొని కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



దుబ్బపల్లిలో రోడ్డుపై వేసిన చెత్త

ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్‌ను మంగళవారం కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎస్‌ఏ షుకూర్ హైదరాబాద్‌లో జమాతే ఇస్లామిహింద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు విషయాన్ని సమైక్యవాదులకు తెలియపరిచారు. దీనిపై ఇటీవల టీజీపీఎస్‌సీ నిర్వహించిన గ్రూపు-2 పరీక్షలో ఒక ప్రశ్న వచ్చింది. ఇస్లామీహింద్ నిర్వహించిన సభకు ఎవరు అధ్యక్షత వహించారని ప్రశ్న వచ్చింది. ఈ సందర్భంగా కరీంనగర్ నవరస్‌స్ట్రీట్‌లో ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్‌ను పురుమల్ల శ్రీనివాస్‌తో పాటు సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ మోసిన్, నాయకులు అహ్మద్ అలీ, ఖదీబుద్దీన్, సిరాజ్‌హుస్సేన్, కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ మహ్మద్ పాషా, అబ్దుల్ రహమాన్, ఇమ్రాన్, అమేర్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

'హలో మాల.. చలో అసెంబ్లీ'కి తరలిరండి

సుభాష్‌నగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): హలో మాల.. చలో అసెంబ్లీ కార్యక్రమానికి వేలాదిగా మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ నల్లల కనకరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో అంటకాగుతున్న మందకృష్ణమాదిగకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏవిధంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ప్రశ్నించారు. మాలల సింహగర్జనకు రాని ముఖ్య మంత్రి మాదిగలు పిలుస్తే ఎలా వెళతారన్నారు. ఈనెల 19న వేలాదిగా మాలలు తరలివచ్చి అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. సమావేశంలో నక్క రాజయ్య, కె లక్ష్మీరాజం, రొడ్డ శ్రీనివాస్, సాతాల సాగర్, మద్దెల రాజేందర్, బైరం కుమార్, గొర్రె రవీందర్, బిట్ల రవి, రొడ్డ నిరంజన్, రమేశ్, మల్లేశం పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించి మధుమేహం, క్షయవ్యాధి, కామెర్లు, అధిక రక్తపోటు లాంటి ప్రమాదకారకాలను ముందుగానే గుర్తించాలని అర్మాన్ గ్రూపు సంస్థ శిక్షకులు మౌనిక, సంతోషిని సూచించారు. ప్రసూతి సమయంలో నవజాత శిశు మరణాలను తగ్గించడానికి మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మొదటి, రెండో ఏఎన్‌ఎంలకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ అధిక ప్రమాదకారకాలను ముందుగానే గుర్తించి గర్భస్థ మహిళలను సకాలంలో రిఫరల్ చేయడం వల్ల మాతా శిశు మరణాల రేటును తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సనాజువేరియా, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంతాపం

భగత్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 58వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయ భర్త రాపర్తి వెంకటేశం మరణం పట్ల బీజేపీ నాయకులు సంతాపం ప్రకటించారు. కార్పొరేటర్ విజయతో పాటు, వారి కుమారుడు రాపర్తి ప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయినపల్లి ప్రవీణ్‌రావు, పెద్దపల్లి జితేందర్, బండ రమణారెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్ ఏసీపీగా వెంకటస్వామి



కరీంనగర్ క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ టౌన్ ఏసీపీగా వెంకటస్వామిని నియమిస్తూ ఇన్‌చార్జి డీజీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత టౌన్ ఏసీపీ గోపతి నరేందర్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా ప్రస్తుతం రామగుండం కమిషనరేట్‌లోని సీసీఎస్‌లో పనిచేస్తున్న వెంకటస్వామి కరీంనగర్ టౌన్ ఏసీపీగా నియమితులయ్యారు.

సీఎంను కలిసిన ఒలింపిక్ సంఘం జిల్లా బాధ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యవర్గం మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించింది. సీఎంతో క్రీడారంగం అభివృద్ధి, క్రీడా పాలసీ, క్రీడా యూనివర్సిటీ, స్కూల్ గేమ్స్ తదితర వాటిపై చర్చించారు. సీఎంను కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి, ఒలింపిక్ సంఘం కార్యవర్గ సభ్యులు సిలివేరి మహేందర్‌లు ఉన్నారు.

'విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను, మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భౌతిక, గణిత శాస్త్రాలలోని విషయాలపై విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై లోతైన అవగాహనను పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణులు అయ్యే విధంగా విద్యార్థులకు మార్గదర్శనం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి మారం స్వదేశీ కుమార్, జిసిడి ఓ కృపారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నేడు వినతుల స్వీకరణ

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషన్ చైర్మన్ జస్టిస్ డా.శమీం అక్తర్ షెడ్యూల్డు కులాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ, ఉపసంచాలకులు యం.నాగైలేశ్వర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నందు షెడ్యూల్డు కులముల వర్గీకరణపై బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీఆర్‌టీయూటీజీ జిల్లా కార్యదర్శిగా మంజుల



కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కార్యదర్శిగా దన్గర్‌వాడి పాఠశాల ఎస్‌జీటీ గాలి మంజులను నియమిస్తూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, కేతిరి తిరుపతిరెడ్డిలు ఉత్తర్వులు జాఈరీ చేశారు. ఈసందర్భంగా తన నియామకానికి సహరించినవారికి మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ తనపై విశ్వాసంతో జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలియజేస్తూ పీఆర్‌టియు తెలంగాణ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. మంజులకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు పబ్బ జ్యోతిలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు గుండేటి పుష్పలత, ఫర్హాత్ షాహిన్, జిల్లా కార్యదర్శి కె.సుమ, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా జైలును మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. జైలులోని ఫోన్ ములాఖత్. ఆసుపత్రి, వంటశాల, లైబ్రరీ, ఇండస్ట్రీ, క్యాంటిన్‌లను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, జైలర్లు పి శ్రీనివాస్, బి రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎం సుధాకర్‌రెడ్డి, ఎన్ సంగీత, లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేష్, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో మోకాళ్ళపై నిలబడి బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరహరి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమమ్ పే స్కేలు, జీవిత బీమా, హెల్త్‌కార్డులు, సమగ్ర శిక్ష మహిళ ఉద్యోగులకు 108 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రూ. 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మరణించిన కుటుంబాలకు రూ. 15లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు బెజ్జంకి అంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ఎం అజిత, బి రమాదేవి, ఎన్ పూర్ణిమ, గౌతమి, పి మాదవి, పి కిరణ్‌జ్యోతి, ఎం స్వప్న, ఏ సునీత, పి మధులత, వరలక్ష్మి, నీరజ, రవిచందర్, అంజనేయులు, వెంకటేష్, శ్రీకన్య, బి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

మానకొండూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని టీబీ నివారణ అధికారి డాక్టర్ రవీందర్ సూచించారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో వంద రోజుల టీబీ నిర్ధారణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 60ఏళ్లు దాటిన పొగాకు, మద్యం అలవాటు ఉన్న స్త్రీ, పురుషులందరూ టీబి పరీక్షలు చేసుకోవాలన్నారు. 30 ఏళ్లు దాటిన మహిళలందరూ క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సౌమ్య, ఎండీ సల్మాన్, సుకుధా, సీహెచ్‌వో రాజ్‌నాయక్, సూపర్‌వైజర్ జుబేరు, సదయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడేలా బోధించాలి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులపై ప్రధాన దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



డీఎస్ నకార చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్‌హాల్, ఎంపీడీవో సమావేశ మందిరంలో వేర్వేరుగా పెన్షనర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, పెన్షనర్స్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్ : నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో మహేశ్వర్‌తో పాటు ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని సీనియర్ పెన్షనర్లను సన్మానించారు.

బీజేపీలో చేరికలు

హుజూరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వ ర్యంలో ఈదులకంటి రమాదేవితో పాటు పలువురు మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొంరయ్య వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రమాదేవి తెలిపారు.

సీపీఐ సభ్యత్వ సేకరణలో భాగస్వాములు కావాలి

సైదాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సభ్యత్వ సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అనిల్, కొంరయ్య, రాజేశం, వెంకటేష్, శ్రీనివాస్, రవి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి



హుజూరాబాద్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గంగాధరలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

హుజూరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట లగచర్ల రైతులను విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళశారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతులకు సంకెళ్లు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరోజు కూడా పాలన చేయవద్దన్నారు. కార్యక్రమంలో బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, అయిలయ్య, టి శ్రీనివాస్, ఉమాయ్య, కృష్ణ, ఇమ్రాన్, శిరీష, రాజు, రాజ్‌కుమార్, అనురాగ్, సమ్మయ్య, నరేష్, కమలాకర్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: లగచర్ల ఘటనలో రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

●గంగాధర: రైతులపై అక్రమ కేసులు ఎత్తి వేసేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గంగాధరలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాగి మహిపాల్ రావు, నవీన్‌రావు, దూలం శంకర్‌గౌడ్, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

●గన్నేరువరం: లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని నిరసిస్తూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, మీసాల ప్రభాకర్, గూడెల్లి అంజనేయులు, కొట్టె భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మహాత్మానగర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి మండల బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రావుల రమేష్, ఎలుక అంజనేయులు, మాతంగి లక్ష్మణ్, పొన్నల సంపత్, బాబు పాల్గొన్నారు.

● మానకొండూర్: లగచర్ల రైతులను విడుదల చేయాలని కోరుతూ మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మానకొండూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, నెల్లి మురళి, గుర్రం కిరణ్, అంజనేయులు, ఉండింటి అనిల్, రమేశ్, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

● రామడుగు: లగచర్ల రైతులను అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని మండలంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు.

● చిగురుమామిడి: లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెనుకుల తిరుపతి, సాంబారి కొమురయ్య, దుడ్డెల లక్ష్మీనారాయణ, పెసరి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్: లగచర్ల రైతులపై అక్రమ కేసు పెట్టి, థర్డ్ డిగ్రీ ఉపయోగిండాన్ని నిరసిస్తూ మంగళవారం సైదాపూర్ మండలం ఘణపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ ఎంపీటీసీ ఓదెలు, నాయకులు రవీందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శంకర్‌నాయక్, అశోక్, రాజిరెడ్డి, కొంరయ్య, జైపాల్, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న పోలీసులు

తిమ్మాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు తలపెట్టిన చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న పంచాయతీ కార్మికులు, సిబ్బందిని ఎల్ఎండీ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పంచాయతీ కార్మికులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు క్రిస్మస్ పండుగ వేడుకలు పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జాతీయ పాస్టర్ డాక్టర్ జడ్‌సన్ అబ్రహం హాజరయ్యారు. సీనియర్ పాస్టర్ రంగాపూర్ చర్చి పాస్టర్ డాక్టర్ నెల్సన్ దంపతులను నియోజకవర్గ పాస్టర్లు సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు దేవిరాజు, సెక్రటరీ సారంగపాణి, ట్రెజరర్ జోజఫ్‌లు ఉన్నారు.



రంగాపూర్ చర్చిపాస్టర్ డాక్టర్ నెల్సన్ దంపతులను సన్మానిస్తున్న పాస్టర్లు

వృద్ధుడిని చేరదీసిన ఆశ్రమం

రామడుగు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్‌లో భిక్షాటన చేస్తున్న దాసరి సమ్మయ్య అనే దివ్యాంగ వృద్ధుడి పరిస్థితిని చూసి చలించిన పోలీసులు రామడుగు మండలం వెలిచాలలోని స్పందన అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకుడికి సమాచారం అందించగా ఆయన చేరదీశారు. ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ వృద్ధుడిని ఆశ్రమానికి తీసుకువచ్చి అండగా నిలిచారు.

సమాజ సేవలో ముందుండాలి

గంగాధర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :యువత సామాజిక సేవలో ముందుండాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోద్నాల యగ్నేష్ అన్నారు. మంగళవారం గంగాధర మండలం ఉప్పరమల్యాలకు చెందిన పేదింటి వృద్ధురాలు పిల్లి గౌరవ్వ పరిస్థితికి చలించి 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు మహేష్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చొప్పదండి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో వంశీకృష్ణలు పాల్గొన్నారు.

వెండి అభయ హస్తం అందజేత

చొప్పదండి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారికి వెండి అభయహస్తం, వెండి పుస్తకాన్ని చొప్పదండికి చెందిన గుర్రం విజయ కొమురెల్లారెడ్డి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు జగన్మోహన్‌స్వామి, శ్రీభాష్యం నవీన్‌కుమార్ ఉన్నారు.

కరాటేలో ఎస్‌ఆర్‌కె విద్యార్థుల ప్రతిభ

గన్నేరువరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో మండలంలోని గుండ్లపల్లి శ్రీరామకృష్ణ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు కౌశిక్ రెడ్డి, శ్రీజ, రమ్య, శ్రీహిత్, వరుణ్‌లు ప్రతిభ కనబరిచారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రజ్ఞశృతి, కరాటే మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్ వారిని అభినందించారు.